1984 దీపావళి కథలపోటీలో రు.650/- బహుమతిపొందిన కథ

# నాకూ ఓ ముహూర్తం పెట్టవే నాన్నా?

**"రేపు ఆదివారం ఉదయం తొమ్మిదీ పది నిముషాలకు చాలా దివ్యంగా వుంది ముహూర్తం. సంబంధం ఖచ్చితంగా నిశ్చయ మౌతుంది. గ్యారంటీగా చెబుతున్నాను!" అర గంట సేపు పంచాంగం గుణించాక అన్నారు రామశాస్త్రి గారు.**

**ఆ మాటలు వింటూ ఆయన కెదురుగా కూర్చున్న పొరుగూరి మనిషి మొహం ఆనందంతో వికసించింది.**

తప్పకుండా సంబంధం రైటవుతుందంటారా?" ఆ వ్యక్తి ఆత్రంగా అడిగాడు

"భలే వాడివేనయ్యా రాములూ శాస్త్రి గారు ముహూర్తం పెట్టడం ఏమిటీ పని కాక పోవటం ఏమిటీ? ఆయన తథాస్తు అంటే సాక్షాత్తు ఆ బ్రహ్మదేవుడు తలూపేసినట్లే" అన్నాడు ప్రక్కనే కూర్చున్న వూరి పెద్ద నాయుడు

ఆ మాటలకు చిన్నగా నవ్వి "అదంతా మీకున్న గురి!" అన్నారు శాస్త్రిగారు

"సంబంధం రైటయితే మీకు పంచె చాపు నూట పదహార్లూ ఇచ్చుకుంటాను " అంటూ ఓ అయిదు రూపాయలు తీసి శాస్త్రిగారి ముందు పెడ్తూ - "ప్రస్తుతానికి ఇది ఉంచండి శాస్త్రిగారూ!" అని లేచి సెలవు తీసుకున్నాడా మనిషి

ఆ తర్వాత నాయుడు కూడా కాసేపు కూర్చుని నిష్క్రమించాడు శాస్త్రిగారు మరి కాసేపు ఎవరైనా వస్తారేమోనని ఎదురు చూసి ఇంక ఎవరు రారని నిర్ధారించుకున్నాక లోనికి నడిచారు లోనికి అడుగు పెడుతూండగానే లోపలి గుమ్మంలో నిలబడిన భార్య కనపడిం దాయనకు

"సంబంధం ఖాయమైతే కొత్త బట్ట పెట్టి నూట పదహార్లు ఇస్తామన్నారు!" - పైనున్న ఉత్తరీయం తీసి దండెంమీద వేస్తూ అన్నా రాయన

ఆవిడ బదులు పలకలేదు

వీర్నాయుడు తాలుకు వాళ్ళే నమ్మచ్చు! అన్నా రాయన మళ్ళీ.

పాతికేళ్ళుగా ఆ చుట్టు ప్రక్కల అయిదారు గ్రామాల ప్రజలకు ముహూర్తాలు పెట్టడం మంచీ - చెడూ చెప్పటం చేస్తూ వుంటారు శాస్త్రిగారు

వచ్చిన ప్రతీ వాళ్ళూ పనయితే అంత చేస్తాం ఇంత చేస్తాం అంటూ ఆ బీద బ్రాహ్మడికి ఇంతకంటే ఎక్కువ ఇవ్వటం దేనికి అన్నట్లు అయిదు - పదీ చేతులో పెట్టి వెళ్తూండటం మామూలే

అయితే అలా అని వెళ్ళిన వాళ్ళెవరూ మళ్ళీ వచ్చి ఏమీ విదల్చటం అంటూ జరగలేదు

శాస్త్రిగారు ముహూర్తం పెడితే ఆ ఇంట పంది రేసినట్లే అన్న ప్రతీతి మాత్రం బాగా ఏర్పడి పోయిందా చుట్టు ప్రక్కల

పూర్వీకుల నాటి చిన్న పెంకుటిల్లూ - ముహూర్తాలు పెట్టి సంపాదించే కొద్దిపాటి సంపాదనతో ఆయన సంసారాన్ని ఈదుకొస్తున్నారు

ఇద్దరు కూతుళ్ళూ - ఒక కొడుకూ ఆయన కున్న సంతానం

ఇంతవరకూ జీవితం గుట్టుగానే సాగిపోతోంది పెద్ద కూతురు కామాక్షి పెళ్ళి కెదిగి రావటంతో ఆయనకు సమస్య మొదలైంది

కూతురి పెళ్ళి గురించి అనుక్షణం పోరు పెడుతూనే ఉంటుంది ఆయన భార్య అయితే బాధ్యతలు నెరవేర్చాలని ఎవరికుండదూ? అక్కడికి శాస్త్రిగారు సంబంధాల గురించి వాకబు చేయటమే కాదు ఎక్కడ పెళ్ళి కొడుకులు ఉన్నారన్నా తీసుకొచ్చి కూతురుకి చూపిస్తూనే ఉన్నారు

అయితే అన్నింటితో బాటే వరుల ధరలు కూడా ఆకాశాన్ని అంటుతూండటంతో కూతురికి పెళ్ళి చేయటానికి ఆయనకున్న తాహతు చాలటం లేదు

దాంతో ఆయనకు భార్య ముందు నిలబడటం అంటేనే భయంగా ఉంటోం ది మధ్య

కామాక్షికి మొదట్లో తల్లి తండ్రులు తన పెళ్ళి ప్రస్థావన తెచ్చి మాట్లాడుకుంటున్నప్పుడు సహజంగానే

బోలెడు సిగ్గు ముంచుకొచ్చేసి బుగ్గలు ఎర్రగా కందిపోయేవి

మధురమైన ఊహలు మనసుని ముంచేత్తుతూంటే ఆమె అందమైన కలల ప్రపంచంలో కలసిపోయేది పెళ్ళి వారు వచ్చి వెళ్ళేటంత వరకు తమ్ముడూ, చెల్లెలూ – మా అక్కయ్య పెళ్ళి కూతు రాయెనే అంటూ పాడుతూ ఆట పట్టిస్తూంటే చిరుకోపాన్ని అభినయిస్తూ వాళ్ళని తరిమి కొట్టేది

పెళ్ళి చూపులు ఏర్పాటు చేసిన ప్రతీ మాటు ఓర కంట పెళ్ళి కొడుకుని చూస్తూ ఇతడేనేమో తనకి కాబోయే వాడు అనుకునేది

తీరా ఆ సంబంధం తప్పిపోతే 'ఆ స్కూలు మేష్టరు సంబంధం కంటే ఇంకా మంచి సంబంధం వస్తుందేమో' అని సరిపెట్టుకునేది మొదట్లో

మరోసారి మరో పెళ్ళివారు కాదంటే – 'పోన్లెద్దు గవర్నమెంటు హాస్పిటల్లో కాంపౌండరట అతగోడు మందులు దొంగతనంగా అమ్ముకోవటం పేషెంట్ల దగ్గర పీడించి డబ్బులు వసూలు చేయటం బాబోయ్ ఆ పాపాన్ని తనూ బరించాలి అతన్ని చేసుకుంటే' అనుకునేది లోపల మాత్రం వచ్చిన సంబందం అల్లా తప్పిపోతూండటం వలన బాదపడుతూ

కామాక్షికి రాను రాను పెళ్ళి కూతురి ముస్తాబు యాంత్రకమైపోయింది

కామాక్షి తమ్ముడూ – చెల్లెలూ 'అక్కయ్య పెళ్ళి కూతు రాయెనే అని ఆట పట్టించటం మానేశారు

ఎప్పుడూ ఏదో ఆలోచిస్తున్నట్లు ఉంటుంది కామాక్షి ఆమెకి తన పెళ్ళి తాలుకు కలలు రావటం మానేశాయి

స్కూలు మాష్టారయినా – లంచాలు తీసుకునే గవర్నమెంటు హాస్పిటలు కాంపౌండరూ మరెవరయినా తన మెడలో పసుపు తాడు కట్టే దయామయుడు వస్తే బాగుండననుకుంటోందామె ఇప్పుడు

శాస్త్రిగారు సావిట్లో స్థంబానికి ఆనుకుని కూర్చున్నారు

'పెద్దపూడి వెళ్తా నన్నారు' – భార్య అంది మెల్లగా

'భోజనం చేసి బయలు దేరుతా' – చెప్పారాయన భార్య వైపు చూడకుండానే

ఆదివారం నాడు రమ్మన మనండి ఆలస్యం మంచిది కాదు' అలాగే పుల్లేరుకుర్రు కూడా వెళ్ళి రండి అందావిడ మళ్ళా

అలాగే నన్నట్లు తలూపా రాయన



రెండ్రోజులంకితం ఎవరో చెప్పారు పెద్దపూడిలో సంబంధం ఉన్నట్లు అంతే ఆక్షణం నుంచి ఆవిడ శాస్త్రిగారికి ఊపిరి సలుపనీయటంలేదు

ఆ అబ్బాయికి చిన్నప్పుడు పోలియో వచ్చి అవిటి-తనం వచ్చిందట సరిగ్గా నడవ లేడని చెప్పారు అయితే తల్లి - తండ్రులకు ఒకడే సంతానం అవ్వటం వలన ఉన్న ఇల్లు - రెండెకరాల పొలం అతనికే చెందుతాయని దానివలన పిల్లకి తిండికి బట్టకూ లోటుండదని సంబంధం తెచ్చిన వాళ్ళు చెప్పారు

ఆరోజు కామాక్షి తన దురదృష్టానికి భోరుమని ఏడ్చింది వంటరిగా కూర్చుని

తనే జన్మలో ఎవరికి ఏం అపకారం చేసిందని తన తలవ్రాత ఇంత వక్రంగా వ్రాయబడింది?

చివరికి ఒక అవిటి మనిషి ద్వారా తన కన్నె చెర తొలిగేలా నిర్ణయించాడా దేవుడు?

ఆమె హృదయం మౌనంగా రోదించింది

పెద్దపూడి వెళ్ళి సాయంకాలానికి తిరిగొచ్చారు శాస్త్రిగారు మొదట కాళ్ళు కడుక్కొనేటందుకు నీళ్ళిచ్చి త్రాగటానికి గ్లాసుతో నీళ్ళు అందించిం-దాయన భార్య

పదిమైళ్ళు నడిచి వచ్చిన అలుపుతో కాసేపు మాట్లాడకుండా కూర్చున్నారు శాస్త్రిగారు

ఆ మౌనాన్ని కాసేపు భరించి - 'ఏమైందీ?" - అందాయన భార్య

కామాక్షి ప్రక్కగదిలోంచి చెవులప్పగించింది తండ్రి మాటలు వినటానికి

"ఆదివారంనాడు చూస్కోటానికి వస్తానన్నారు' - చెప్పారాయన

కామాక్షి నెమ్మదిగా ఊపిరి పీల్చుకుంది

"పుల్లేటికుర్రు వెళ్ళలేదా? - అడిగిందావిడ 'ఆఁ, వాళ్ళు వూళ్ళో లేరు మళ్ళీ వెళ్ళాలి' చెప్పారు ఆ రాత్రి బో జనాల దగ్గర కూర్చుండగా శాస్త్రిగారు - "వాళ్ళు పెద్ద ఆశలోనే ఉన్నారు పదివేలు కావలట!" అన్నారు ఆ మాట వింటూ "పది వేలే!" అందాయన భార్య గుండెలమీద చేయి వేసుకుని

## ప్రేమించు!

వడమటి గాలులు నిప్పులు చిమ్ముతూ
ప్రమత్తున్ని చేస్తుంటాయి
తూర్పును ప్రేమించు!
అది నీకు వివేకాన్ని ప్రసాదిస్తుంది
శీత కాలం నీ యెదలో
కోరికను రగిలిస్తుంది
అగ్నిహోత్రాన్ని ప్రేమించు!
అది నీ అజ్ఞానాన్ని దహిస్తుంది
వేసవి మండు టెండలు
నీ జ్ఞాన భూమిని శుష్కింప జేస్తాయి
వర్షపు జల్లును ప్రేమించు!
అది నీ హృదయాన్ని క్షాళనం
చేస్తుంది.
చుట్టూ చిమ్మే చీకటి
పాపాన్ని పురిగొల్పుతుంది
వెలుగును ప్రేమించు!
అది నీ అంధత్వాన్ని పారద్రోలుతుంది.

— దొడ్డంకి వెంకట్రావ్

## నాకూ ఓ ముహూర్తం పెట్టవ్ నాన్నా

కామాక్షి మనసు నీరు కారిపోయింది అది వింటూ

అస్థి ఉంది కదా అందుకనీ " శాస్త్రిగారు అన్నారు

కామాక్షి తల్లి మాట్లాడలేదు

పది వేల కట్నం అంటే తమ తాహతుకి అందనిదని ఆవిడకు తెలుసు ఇంక ఎలా ఆ సంబంధం గురించి ఆశ పడటం? చివరకు అవిటి వ్యక్తిని భర్తగా పొందలేని దౌర్భాగ్యమా తనది?

కామాక్షి మనసు బాధ పడింది

'నన్నెందుకు ఆడదానిగా పుట్టించావ్ భగవంతుడా? ఇలా అడవిలో పువ్వులా రాలి పోవటానికేనా? అనుకుంది కళ్ళల్లో నీళ్ళు నిండు-తూంటే

కాసేపు నిశ్శబ్దం తరువాత - ఇల్లు అమ్మేస్తే? అన్నారు శాస్త్రిగారు

నడి నెత్తిన పిడుగు పడినట్లు ఉలిక్కి పడింది కామాక్షి

ఇల్లు అమ్మేస్తారా?. తనకోసం ఉన్న నీడ పోగొట్టుకుంటారా? ఛీ ఛీ నుదురు కొట్టు-కుంది కామాక్షి

అదైనా జీవితంలో సుఖపడాలి అనుకుంటే అమ్మక తప్పదు ఇంక ఏమైనా మిగిలితే చిన్నదాని పేరున బ్యాంకులో వేసి ఉంచటం కాస్త వయసు వచ్చాక ఏదో ఒకటి చూసి చేసెయ్యటం శాస్త్రి-గారు అన్నారు

"ఇల్లు అమ్మక తప్పదా?" అడిగిం దావిడ


దానికి సమాధానం చెప్పలేదు ఆయన


'నాన్నా ఇల్లు అమ్మేస్తే జామచెట్టు కూడా వాళ్ళకే ఇచ్చేయ్యాలా" కామాక్షి తమ్ముడు తండ్రిని అమాయకంగా అడిగాడు

వెర్రి వెదవ జామచెట్టు మాత్రం ఏమిటీ 'అందులో ప్రతీ అణువూ తమకి దూరం అయి పోతుందని తెలియదు ఈ అక్కయ్య కారణంగా!" అనుకుంది చెంపల మీదుగా కనీళ్ళు జారుతూంటే కామాక్షి

ఆదివారం వచ్చింది

కామాక్షి తల్లి నానా హడావిడీ చేయసాగింది కూతుర్ని తయారవ్వమంటూ అవిటివాడి ముందు కూర్చునేటందుకు కూడా అలంకరణ తప్పదా?






రావణునికి పది తలలూ, ఇరవై చేతులూ ఉన్నట్లు మన పురాణాది వాఙ్మయంలో కానవస్తున్నది సీతాదేవిని అపహరించుటకు వచ్చినప్పుడు, మరి కొన్ని చోట్ల ఒక్క తల, రెండు చేతులు మాత్రమే ఉన్నట్లు తెలుస్తున్నది పుట్టినప్పుడు అతనికి పది తలలు, ఇరవై చేతులు లేనట్లు తెలుస్తున్నది జనన సమయంలో అతడు, పదిమంది అరచినట్లు గట్టిగా ఏడ్చాడనీ, అందు వల్లనే రావణుడని పేరు వచ్చిందనీ గాథ పది మంది కంఠ ధ్వనులు కలిగినందున దశ కంఠుడు అనే పేరు వచ్చిందనీ, కంఠాలను బట్టి, పది తలలూ, వానికి తగినట్లు ఇరవై చేతలూ కల్పించబడినవనీ ఆధునికులలో చాలమంది అభిప్రాయం, అయితే రావణునికి పది తలలు ఉండడానికీ, ఒక్క తల మాత్రం ఉండడానికీ ఆధారంగా ఒక గాథ ఉన్నది

అందరికంటె తాను అన్ని విధాలా అధికుడుగా ఉండగోరి, తన సంకల్ప సిద్ధికై రావణుడు బ్రహ్మను గురించి ఘోరమైన తపస్సు చేశాడు అప్పుడితనికి అందరి వలెనే ఒక తల, రెండు చేతులు మాత్రమే ఉండినవి రావణుని తపస్సునకు మెచ్చి బ్రహ్మ వరమడుగవలెనని కోరినప్పుడు, ఇతడు "దేవా! నీకు నాలుగు ముఖాలు ఉన్నవి ఆ నాలుగు ముఖముల మూలంగా నీవు నాలుగు వేదాలను, అనేక విషయాలను బోధిస్తూ ఉన్నావు వానిని వినుటకు నాకును నాలుగు ముఖములను ఇమ్ము" అనెను బ్రహ్మ "అట్లే యిచ్చితి"-ననెను. రావణుడు "అంతే కాదు నేను నాలుగు దిక్కులందును ప్రచారము చెయ్యడానికి మరి నాలుగు ముఖాలూ, ఊర్ధ్వ లోకానికీ అధోలోకానికీ తెలియ జేయడానికి రెండు ముఖాలు, అన్నీ చేరి పది ముఖాలు ఉండేటట్లు అనుగ్రహించు. ఆ ముఖాలకు తగినట్లుగా ఇరవై చేతులు ఉండేటట్లు చేయి ఈ ముఖాలూ, కరములూ నేను కోరేటప్పుడు ఉండేటట్లు, ఇతర సమయాలలో నేను మామూలుగా ఒక శిరస్సూ, రెండు-చేతులు కలిగి ఉండేటట్లు చెయ్యి" అన్నాడు బ్రహ్మ దానికిన్నీ అంగీకరించి, అతడు కోరినట్లు నరవానరుల చేత కాకుండా, యితరులైన దేవదానవాదుల వల్ల మృత్యువు లేకుండా ఉండేటట్లు రావణునికి వరం ఇచ్చాడు అందువల్ల రావణుడు ఇచ్చవచ్చినపుడు మాత్రం పది శిరస్సులూ, ఇరవై చేతులు ధరించేవాడు ముఖ్యంగా యుద్ధ సమయాలలో వీనిని ధరించేవాడు ఇది జైమిని రామాయణంలో ఉన్నట్టు తెలుస్తున్నది. దీని సత్యా సత్యాల సంగతి ఎలా ఉన్నా రావణుని పది తలలకూ కారణం సమర్థించబడినట్లు గ్రహించవచ్చును □

నీరసంగా నవ్వుకుంటూ అద్దం ముందు కూర్చుంది కామాక్షి ఎప్పటిలాగ చక్కగా అలంకరించుకుందామె చెప్పిన టైముకి అర గంట ముందే వచ్చారు పెళ్ళివారు

గుర్రపు బండి దిగుతూంటే కామాక్షి వీధి కిటికీ-లోంచి చూసింది పెళ్ళి కొడుకుని

పట్లు తప్పిపోయిన కాళ్ళు వంకర టింకరగా ఊగిపోతున్నాయి నడుస్తుంటే మనిషి తెల్లగా ఉన్నాడు మొహం బాగానే ఉంది

పర్వాలేదు . తన అదృష్టం అంతమటుక్కే కాబోలు!' అనుకుంది కామాక్షి

ఆపాటి అదృష్టానికి కూడా తను నోచుకోలేదని రెండ్రోజుల తర్వాత తెలిసింది కామాక్షికి ఆ పెళ్ళి కొడుక్కి కామాక్షి నచ్చలేదంటూ కబురొచ్చింది పెద్దాపూడినుంచి

కామాక్షికి ఏడుపు రాలేదు కదా తన దౌర్భాగ్యానికి తనే జాలి పడి పోయింది

ఆమెకి బాధతోనూ – బెంగతోనూ హృదయం బరువెక్కి పోయింది

దేవుడు ఈ లోకంలోకి ఎవర్ని వంటరిగా పంపడనీ ఒక జంటని ఏర్పాటు చేసే ఉంచుతాడనీ అంటారు అటువంటిది తన బ్రతుకు ఏ తోడుని సాధించలేక పోతోందేమిటీ?

ముమ్మిడివరం నుంచి కామాక్షికి సంబంధం వచ్చింది ఆ కబురు చెబుతూ – "వరుడు రెండో పెళ్ళి వాడు అయితేనేం కుర్రాడిలాగే కనపడతాడు కట్నం గిట్నం అక్కర్లేదట అన్నారు శాస్త్రిగారు

'మొదటి భార్య సంతానం ఉన్నారా?" కామాక్షి తల్లి అడిగింది భర్తని

ఆయన అయిదు నిముషాలు మౌనంగా ఉండి –

"ఆఁ నలుగురు పిల్లలుట!" అన్నారు

కామాక్షికి తన బ్రతుకంటే తనకే రోత పుట్టింది ఆడదానిగా పుట్టడమే శాపం అనుకుంటే మరీ ఇంత దౌర్భాగ్యురాలైన ఆడ పిల్లగా పుట్టడమా? దేవుణ్ణి ఎంతగానో తిట్టుకుందామె

అయితే ఆ బాధ కొన్ని క్షణాలు మాత్రమే ఉందామెలో ఎలాగైయితేనే తను ఇల్లాలు అవుతుంది కడుపు పండకుండానే పిల్లల తల్లి అవుతుంది అదీ ఒకలా అదృష్టమే అనుకుంది మనసులో

ఆలోచించగా ఇంకా కొన్ని లాభాలు కూడా కనిపించాయి ఆమెకు ఒక చిన్న పసుపుతాడు కోసం తల్లి తండ్రుల్ని నీడలేని వాళ్ళుగా చేయక్కర్లేదు

తన తర్వాత పెళ్ళి కెదిగి కూర్చునే చెల్లెలి సమస్యకి చేయూత నివ్వచ్చు

తన పెళ్ళి కారణంగా ఇల్లు అమ్మవల్సి వస్తే జామ చెట్టు పోయిందనే బాధ తమ్ముడికి లేకుండా చేయొచ్చు

తనకీ సంబంధం నిశ్చయమైతే ఎంత బాగుండునూ? ఓ ముహూర్తంలో వాళ్ళు తనని చూసి అవునంటే ఎంత బావుండునూ?

కామాక్షి మనసులో తండ్రిని ఉద్దేశిస్తూ – 'నాకో మంచి ముహూర్తం పెట్టు నాన్నా!. ఆ ముహూర్తం నన్ను ఇల్లాలిని చేసేదిగా ఉండాలి నాన్నా నన్ను ముత్తయిదువుగా కడతేర్చాలి అవును నాన్నా! నేను పెళ్ళికాని కన్నెగా రాలిపోకూడదు మెడలో ఓ పురుషుడిచేత తాళి కట్టించుకుని తనువు చాలించాలి . నాన్నా! అందుకే అందుకోసమయినా నాకీ ముహూర్తం పెట్టవ్?" అనుకుంది

అలా అనుకుంటూంటే. ఆమెకి కళ్ళ నీళ్ళు తిరిగాయి □